క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాయిరాం కాలనీ (జనప్రియనగర్) ఫీడర్ పరిధిలో హఫీజ్‌పేట్ ఇండస్ట్రీయల్ ఏరియా, ప్రజయ్‌సిటీ, జనప్రియ నగర్, సాయిరాంనగర్, ఓల్డ్ హఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.
- మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ప్రకాష్‌నగర్, వినాయకనగర్, హుందయ్ షోరూం వెనుక, హఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్, యూత్ కాలనీ, ఓల్డ్ హఫీజ్ పేట్ విలేజ్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, హఫీజ్‌పేట్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గోల్డెన్ తులీప్, గోపాల్‌రెడ్డి నగర్, ఆర్టీ ఆఫీస్ ఎదురుగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాజరాజేశ్వరీనగర్ పరిసరాలు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

'మనూ' దూరవిద్య కోర్సులలో ప్రవేశాలు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వివిధ దూర విద్యా కోర్సులలో అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తోందని డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రజావుల్లాఖాన్ మంగళవారం తెలిపారు. దూర విద్యా కోర్సులలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులలో ఆన్‌లైన్ అడ్మిషన్లను అందిస్తోందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించడానికి ఆగస్టు 25 చివరి తేదీగా అని తెలిపారు. అడ్మిషన్ ఫీజును ఆగస్టు 31 వరకు చెల్లించవచ్చన్నారు. దూర విద్యా కోర్సులలో ఎంఏ ఉర్దూ, హిందీ, ఇంగ్లిష్, అరబిక్, హిస్టరీ, ఇస్లామిక్ స్టడీస్, బీఏ, బీకామ్, బీఎస్సీలో ప్రవేశాలు ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాల కోసం స్టూడెంట్ సపోర్ట్ యూనిట్ (ఎస్ఎస్‌యూ) హెల్ప్‌లైన్ నంబర్లు 040-23008463, 040-23120600 (ఎక్స్‌టెన్షన్ 2207, 2208)ని సంప్రదించాలని కోరారు.

16 మందికి కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 16 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 12 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

చురుగ్గా ఓటరు నమోదు ప్రక్రియ

- డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియ చురుకుగా సాగుతోందని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్ రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలోని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది కొత్తగా ఓటరు నమోదు, అడ్రస్‌ల మార్పులపై దరఖాస్తులను స్వీకరిస్తున్నారన్నారు. అందులో భాగంగా మంగళవారం ఫారం-6 కింద కొత్తగా ఓటరు నమోదు కోసం 186 దరఖాస్తులు రాగా, ఫారం-8 కింద అడ్రస్‌లు, పేర్లు, ఇతర మార్పుల గురించి 108 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలలో ప్రత్యేక ప్రక్రియను ప్రారంభించామన్నారు.

కాలనీలో బస్తీదర్శన్..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పాషా కాలనీ,3వ బ్లాక్‌లో మంగళవారం బస్తీ దర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

ఆర్థికసాయం

రాయదుర్గం: ప్రమాదంలో గాయపడిన బీజేపీ కార్యకర్త నవీన్ తండ్రి త్రినాథ్‌ను మంగళవారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పరామర్శించారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ వద్ద కారు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని ఆయనకు రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గోపన్‌పల్లితండా వడ్డెర సంఘం అధ్యక్షుడు వడ్డెర శ్రీరాములు, నాయకులు పాల్గొన్నారు.

వాహనాల నంబర్ ప్లేట్లపై పోలీసుల నజర్

దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. దీనికి తోడు నంబర్ ప్లేట్లు లేని ఆటోలలో చెడ్డి గ్యాంగ్ తిరుగుతుందన్న ప్రచారం జోరుగా సాగడంతో పోలీసులు నంబర్ లేని వాహనాలపై ప్రత్యేక నజర్ పెట్టారు. జాతీయ రహదారి,కాలనీలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నంబర్ లేని వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నారు. కొంతమంది వాహనదారులు ట్రాఫిక్ చలాన్లు తప్పించుకోవడం కోసం నంబర్ ప్లేటు సగం విరగొట్టడం, నెంబర్ ప్లేట్ లోని ఒక అంకెను తొలగిస్తున్నారని విషయాలు పోలీసుల దృష్టికి వచ్చాయి. ఇప్పటికే 8 వాహనాలు పైగా పోలీసులు సీజ్ చేశారు. ఎక్కడైనా నంబర్ ప్లేట్ లేని వాహనాలు తిరుగుతుంటే స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, కొంత



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

మంది తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇస్తున్నారని అలా చేస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. స్కూలు విద్యార్థులకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. వాహనాలపై ప్రయాణించేటపుడు తప్పనిసరిగా లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు దగ్గర ఉంచుకోవాలని చెప్పారు. ప్రజల భద్రతే తమ లక్ష్యమని వివరించారు.

కఠిన చర్యలు తప్పవు



నంబర్ ప్లేట్ లేని వాహనాలపై తిరిగితే కఠిన చర్యలు తప్పవు. పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నంబర్ ప్లేట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నాము. ఎవరైనా నంబర్ ప్లేట్లు లేకుండా తిరిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించండి. చిన్నారులకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులు, వాహన యాజమానులపై చర్యలు తీసుకుంటాం. అదేవిధంగా ఇంటికి తాళం వేసి ఎవరైనా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే విలువైన వస్తువులను ఇంట్లో ఉంచవద్దు. ,స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

–నరేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, రామచంద్రాపురం

నాలా కన్వర్షన్ సమస్యలు పరిష్కరించాలి

సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్‌ను కలిసిన ప్రభుత్వవిప్ గాంధీ, ఎమ్మెల్యే వివేకానంద్, బిల్డర్లు



గచ్చిబౌలి: హెచ్ఎండీఏ పరిధిలోని స్థల యజమానులు, నిర్మాణదారులు రెండేళ్ళుగా నాలా కన్వర్షన్ సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ, ఎమ్మెల్యే వివేకానంద, ఎన్ఏఆర్ఈడీసీఓ వెస్ట్‌జోన్ బిల్డర్ల అసోసియేషన్ ప్రతినిధులు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, భూపరిపాలనా కమిషనర్ నవీన్‌మిట్టల్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నారెడ్కో వెస్ట్‌జోన్ బిల్డర్ల అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ హెచ్ఎండీఏ పరిధిలో 15 శాతం ఏరియాను తాకట్టు పెట్టుకొని నిర్మాణాలకు బిల్డింగ్ పర్మిషన్ ఇచ్చి నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఏడాది గడిచినా నాలా సమస్యతో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు రాక రెసిడెంట్లు, నిర్మాణదారులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని నిర్మాణాలు పూర్తయి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ నాలా సంబంధించిన చార్జీలు తీసుకొని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని పంచాయితీ లేఔట్‌లో ఉన్న చిన్నచిన్న సమస్యలను, గజాలలో మిగిలిన భూమిలో నాలా కన్వర్షన్‌కు సంబంధించిన విషయాలను పరిష్కరించాలని కోరామన్నారు. ఇందుకు నవీన్ మిట్టల్ సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో నారెడ్కో ప్రతినిధులు ప్రభాకర్‌రావు, కెవి ప్రసాద్, రాంకుమార్, సుభాష్, శివచౌదరి, పవన్‌నాయుడు పాల్గొన్నారు.

బీజేపీ మహా ధర్నాను విజయవంతం చేయండి

పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: చలో మెదక్ బీజేపీ మహా ధర్నాను జయప్రదం చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మెదక్ పట్టణ కేంద్రంలో ఈ నెల 10 వ తేదీన 'డబుల్ బెడ్ రూమ్' ఇళ్ల కేటాయింపుపై మహా ధర్నా కార్యక్రమం ఉందని, దీనికి మాజీ మంత్రి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 9 సంవత్సరాల కాలంలో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ నిర్మాణం చేపట్టిన 'డబుల్ బెడ్ రూమ్' ఇళ్ళను ఏ ఒక్క పేదవారికి కేటాయించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించే వరకు వారికి అండగా ఉండి బీజేపీ తరపున పోరాడుతామన్నారు.ప్రచారాలకు పరిమితమయ్యారే కానీ నిర్మాణం పూర్తయిన డబుల్ ఇళ్ళను ఏ



మాట్లాడుతున్న శ్రీకాంత్ గౌడ్

ఒక్కరికి కేటాయించలేదని కొన్నిచోట్ల నిర్మాణ దశలో ఉండగానే శిథిలావస్థకు చేరుకున్నాయని మండిపడ్డారు. ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, భారతీనగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్‌రాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆదిత్య ఎస్.ఆర్.కే యువసేన సభ్యులు షకీల్, బన్నీ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 11నుంచి గీతంలో అంతర్జాతీయ సదస్సు

- పత్ర సమర్పణకు తుది గడువు 25

పటాన్‌చెరు టౌన్: గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌స్‌లోని భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 11-13 తేదీలలో 'ఘనీభవించిన పదార్థ భౌతిక శాస్త్రంలో పురోగతి' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ సదస్సులో పత్ర సమర్పణ ఆగస్టు 25వ తేదీలోపు చేయొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఇతర వివరాలకు సదస్సు నిర్వాహకుడు డాక్టర్ ఐవీ సుబ్బారెడ్డి 96181 77690ని సంప్రదించాలని సూచించారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా

గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: కాలనీల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లిలోని రాజీవ్‌నగర్‌బస్తీవాసుల పిలుపుపై ఆయన మంగళవారం బస్తీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటన్నింటిని దశలవారీగా పరిష్కరించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామన్నారు. మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా డ్రైనేజీ పైప్‌లైన్ డయా పెంచి లెవల్స్‌తో అనుసంధానం చేస్తూ ఒక కాలనీ నుంచి మరొక కాలనీకి మధ్యన ఇబ్బందులు తలెత్తకుండా వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. మురుగుకాలువల పనులను త్వరలో చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, చిన్న, రాజు, మునియప్ప, నర్సింహ, రోజా, సుశీల, కృష్ణ, వేణు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సామాజిక శాస్త్రాల మనుగడకు కొత్త ఆవిష్కరణలు చేయాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కంచ ఐలయ్య

రాయదుర్గం: సామాజిక శాస్త్రాలు ప్రస్తుతం, భవిష్యత్తులో మనుగడ సాగించాలంటే కొత్త ఆవిష్కరణలు చేయాలని ఉర్దూ విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ హెచ్ఆర్‌డీసీ ఆధ్వర్యంలో రాజనీతి శాస్త్రం, పబ్లిక్ అడ్మినస్ట్రేషన్‌లో రిఫ్రెషన్ కోర్సు ప్రారంభోత్సవంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ తత్వశాస్త్రం కంటే పాశ్చాత్య తత్వశాస్త్రం గురించి మనకు ఎక్కువ తెలుసన్నారు. పాశ్చాత్య దేశాలపై ఆధారపడిన భారతీయ సామాజిక శాస్త్ర వ్యవస్థకు భారతీయ బోధనా సంప్రదాయాలపై అవగాహన లేదన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్‌లో నలభై లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ముందస్తు ప్రణాళికతో రోడ్డుపై వర్షం నీరు ఉండకుండా లెవెలింగ్ చూసుకొని సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నిరంజన్, వాసుదేవరావు, పద్మయ్య, వెంకటేశ్వరరావు, రమేష్, ఏఈ శ్రావణి, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహంకాళినగర్‌లో చేపట్టిన రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

జ్ఞానేంద్ర ప్రసాద్‌కు నివాళి

హఫీజ్‌పేట్ : స్వర్గీయ జ్ఞానేంద్రప్రసాద్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవాభారతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, ఎల్లేష్, రాధాకృష్ణ యాదవ్, నాయకులు శ్రీధర్ గౌడ్, మాణిక్‌రావు, రవిగౌడ్, ఆకుల లక్ష్మణ్, పృథ్వీ గౌడ్, గణేష్ ముదిరాజ్, అశోక్, శ్రీనివాస్ యాదవ్, రామకృష్ణారెడ్డి, విద్యా కల్పనగౌడ్, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ తదితరులు

సన్మానం



శేరిలింగంపల్లి డీసీ రజనీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డిని దివ్యాంగుల సంఘం అధ్యక్షులు మేకల అశోక్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. అనంతరం దివ్యాంగుల సమస్యలను వివరించారు. అదే విధంగా డబుల్‌బెడ్ ఇళ్ళ కేటాయింపులో 5 శాతం మంజూరుతోపాటు అర్హులైన వారందరికి వచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి దివ్యాంగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఫకీర్ సాబ్, ఉపాధ్యక్షులు వెంకటేష్, ప్రతినిధులు ఉర్మిళ, సాయిబాబు, మధు, ముక్తార్, కుమార్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓటరు నమోదు

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ అధికారులు కాలనీలలో ఓటరు నమోదు ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మంగళవారం గుల్‌మొహర్‌పార్కు కాలనీలో చేపట్టిన ఈ కార్యక్రమానికి కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తగా ఓటరు నమోదుతో పాటు తప్పుల సవరణ, పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించారు. ఏఎంసీ సంజయ్, సర్కిల్ సిబ్బంది స్వరూప్, బాలరాజ్ పాల్గొన్నారు.



గుల్‌మొహర్‌పార్కు కాలనీలో ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ వాసులు